కర్నూలు । నంద్యాల
వార్త
16 జూన్, 2024 ఆదివారం పేజీలు 4

# విభిన్న ప్రతిభావంతులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటారు

**- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్**

**కర్నూలు హాస్పిటల్, జూన్5, ప్రభాతవార్త:** విభిన్న ప్రతిభావంతులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పుడు అండగా ఉంటారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య ఫుడ్‌ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ అన్నారు. పింఛన్ 3 వేల నుండి రూ.6 వేలకు పెంచినందుకు శనివారం నగరంలోని టీజీ భరత్ కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతుల సమక్షంలో చంద్రబాబు నయుడు ప్లేక్సికి పాలాభిషేకం చేశారు. పింఛన్ పెంపుతో వికలాంగులందరు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ తెలిపారు. వికలాంగుల జీవితాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెలుగులు నింపారని కొనియాడారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ విభిన్నప్రతిభావంతుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప, జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సురేష్, టిడిపి విభిన్న ప్రతిభావంతుల విభాగం జిల్లా అధ్యక్షులు కుమ్మరి మద్దిలేటి, జిల్లా ప్రధాన కార్యదర్శి మక్బుల్ బాషా, జేఏసి నాయకులు నాగరాజు, ఈరన్న, శివ, శంకర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



# సంక్షేమం, అభివృద్ధి దిశగా.. సిఎం అడుగులు..!

**- న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్**



**నంద్యాల, జూన్ 15, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి అడుగు వేశారని న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. న్యాయ, మైనార్టీ సంక్షేమ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మొదటిసారిగా నంద్యాలకు విచ్చేసిన సందర్భంగా టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ అధికారులు అందరు కలిసి ఫరూక్‌కు ఘనస్వాగతం పలికి పుష్పగుచ్ఛం, శాలువతో సత్కరించారు. ఈసందర్భంగా న్యాయ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు గురువారం తొలి ఐదు సంతకాలు మెగా డిఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ల పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్ధరణ, స్కిల్‌సెన్సస్ తదితర ఫైల్స్ పై సంతకాలు చేయడం గొప్పవిషయమన్నారు. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే ప్రజాసంక్షేమం కోసం రంగంలోకి దిగడం చంద్రబాబు నాయుడు వల్లే సాధ్యమయిందన్నారు. నంద్యాల ఎమెల్యేగా నన్ను, ఎంపీగా బైరెడ్డి శబరిని భారీ మెజార్టీతో గెలిపించిన నంద్యాల నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నంద్యాల ప్రజలకు తాను ఎన్నికల్లో ఇచ్చిన హామిలను తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకం మెగా డిఎస్సీ పై పెట్టారని 16,347 టీచర్ ఉద్యోగాల భర్తీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. చదువుకున్న యువత ఎన్నికల్లో టిడిపి వైపు నిలబడ్డారని వారి నమ్మకాన్ని తొలిసంతకం సిఎం చంద్రబాబు నాయుడు నిలబెట్టారన్నారు. వైసీపీ తెచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దుచేస్తు రెండవ సంతకం చేశారన్నారు. ఫించన్‌ను రూ.4 వేలకు పెంచుతూ మూడవ సంతకాన్ని చేశారన్నారు. వచ్చే నెల నుంచి దివ్యాంగులకు రూ.6 వేలు, వృద్ధులకు, వితంతువులకు, రూ.4 వేలు ఫించను అందుతుందన్నారు. గత ప్రభుత్వం కక్షపూరితంగా మూసివేసిన అన్నక్యాంటిన్‌లను తిరిగి ఓపెన్ చేసే లా తన నాల్గవ సంతకాన్ని చంద్రబాబు చేశారని ఇక నుంచి పేద ప్రజలు రూ.5 లకు తిండి తినవచ్చునని పేర్కొన్నారు. యువతకు ప్రాధాన్యత ఇస్తు వారిలో ఉన్న నైపుణ్యాలను తెలుసుకునేందుకు నైపుణ్య గణన (స్కిల్ సెన్సస్) చేయనున్నారని అందుకు ఐదవ సంతకాన్ని స్కిల్ సెన్సస్ ఫైల్‌పై పెట్టి బాటలు వేశారన్నారు. ఈ సర్వే ద్వారా యువతకు ఎలాంటి ఉద్యోగాలు కావాలి అనేది తెలుసుకుని అందుకు అనుగుణంగా ఉపాధి కల్పన చేస్తారని చెప్పారు. కాబట్టి ఇచ్చిన మాట ప్రకారం నారా చంద్రబాబు నాయుడు యువతకు, పెన్షన్ దారులకు, నిరుపేదలకు పెద్దపీట వేశారని రాబోయే రోజుల్లో తప్పకుండా అన్ని హామిలు అమలు చేస్తారన్నారు. ఈకార్యక్రమంలో నంద్యాల టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సంతజూటూరు సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం..!

**- బేతంచెర్లకు నియోజకవర్గ ప్రజలకు ఆరు నెలల్లో తాగునీరు అందిస్తాం - ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి**



**బేతంచెర్ల ,జూన్ 15, ప్రభాతవార్త:** గోరుకల్లు రిజర్వాయర్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంతజూటూరు సమస్యను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి పరిష్కరించేందుకు కృషి చేస్తామని అలాగే బేతంచెర్లతోపాటు డోన్, ప్యాపిలి మండలాలకు ఆరు నెలల్లో తాగునీరు అందిస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. శనివారం డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి వాటర్‌గ్రిడ్ ద్వారా తాగునీటి సరఫరా కోసం గోరుకల్లు రిజర్వాయర్ నుండి చేపట్టిన పనులను పరిశీలించడం జరిగింది. దీనితోపాటు రిజర్వా యర్ నీటి వల్ల ఇబ్బందులకు గురవుతున్న పాణ్యం మండలం సంతజుటూరు గ్రామంలోని సమస్యను ఆయన పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంతజూటూరులో చాలా కాలంగా ఈసమస్య ఉందని దీనిని పరిష్కరించేందుకు గతంలోనే నిపుణులతో అధ్యాయనం చేయించడం జరిగిందని అయితే అధికారం లేకపోవడంతో అలానే సమస్య మిగిలిపోయిందన్నారు. ఇది పెద్ద సమస్య అని దీనిని పరిష్కరించేందుకు స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితమ్మతో కలిసి ముఖ్యమంత్రి వద్ద మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. ముందుగా నిపుణుల కమిటీతో సమస్య పై మరోమారు అధ్యాయనం చేయించి వారి సూచనల మేరకు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. చాలా ఖర్చుతో కూడుకున్న పని అని దీని పై సీఎం స్పందించాల్సి ఉంటుందని ఆయన అన్నారు. అలాగే బేతంచెర్ల,డోన్, ప్యాపిలి మండలాల్లో తాగునీటి సరఫరా కోసం చేస్తున్న వాటర్‌గ్రిడ్ పనులు పూర్తి కావడానికి ఇప్పటికే ఆరు నెలలు ఆలస్యమైందన్నారు. దీని పై సంబంధిత గుత్తేదారులు, అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. త్వరలోనే బేతంచెర్లకు తాగునీటి సరఫరా జరుగుతుందని డిసెంబర్ కంతా డోన్, ప్యాపిలి మండలాలకు తాగునీరు అందించేలాగా చూస్తామన్నారు. మరికొంత టెండర్ల ద్వారా పనులు చేపట్టాల్సి ఉందని ఆయన అన్నారు. బుగ్గానిపల్లె తండా సమీపంలో నిర్మించిన వాటర్‌గ్రిడ్ ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. వాటి పనితీరు పై సంబంధిత ఇంజనీర్లతో ఆరా తీయడం జరిగింది. త్వరితగతిన పనులను పూర్తి చేయాలని గుత్తేదారులను, అధికారులను కోరినట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ యల్ల నాగయ్య, పట్టణ అధ్యక్షురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, బీమేశ్వరరెడ్డి, జాకీరుల్లాబేగ్, మోహన్‌గౌడ్, తిరుమలేష్ చౌదరి, పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# రోడ్డు భవనాల శాఖ మంత్రికి.. ఘనస్వాగతం..!

**- అడుగడుగునా గజమాలలతో నీరాజనం పలికిన టీడీపీ శ్రేణులు**

**- స్థానిక ఎమ్మెల్యే కనిపించకపోవడం చర్చనీయాంశం**



**బేతంచెర్ల ,జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ అమాత్యులుగా ప్రమాణస్వీకారం చేసి బనగానపల్లెకు వెలుతున్న బీసీ జనార్ధన్‌రెడ్డికి బేతంచెర్లలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరిల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అయితే స్థానిక ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి ఈ కార్యక్రమంలో కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ధర్మవరం సుబ్బారెడ్డి, షేక్షావలి చౌదరిల పిలుపు మేరకు కర్నూలు రహదారిలోని పెట్రోల్‌బంకు వద్దకు చేరుకుని మంత్రికి డీజేలు, గజమాలలు, టపాకాయలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి అభివాదం చేస్తూ పాతబస్టాండ్ చేరుకోగా గజమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం కార్యకర్తల నినాదాల మధ్య ఊరేగింపు కొనసాగింది. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భవిష్యత్తుకు నిలువుటద్దం.. నాన్న..!



- **కనిపించని ప్రేమతత్వం.. కనిపించే దైవత్వం నాన్న..**
- **నీ మనసెంత గొప్పదో నాన్న..**
- **కష్టాన్ని ఇష్టంగా చేసే వ్యక్తి నాన్న..**
- **పిల్లల భవిష్యత్తే లక్ష్యంగా జీవితం..**
- **నేడు ఫాదర్స్ డే (పితృదినోత్సవం)..**

**" అమ్మ.. ప్రపంచానికి నిన్ను పరిచయం చేస్తుంది.."**
**" నాన్న.. ప్రపంచాన్నీ నీకు పరిచయం చేస్తాడు.."**
**జీవితం అమ్మది-జీవనం నాన్నది..**

**కోసిగి, జూన్ 15, ప్రభాతవార్త :** "కళ్లల్లో ఆత్మవిశ్వాసం.. కొండంత భరోసా.. ప్రేమతత్వం.. స్నేహభావం అన్నీ సమపాళ్లల్లో కలిసి ఉండే మూర్తి మత్వానికి ప్రతీక నాన్న.. కుటుంబమంతటికీ తానున్నానని అభయమిచ్చే విష్ణుమూర్తిలా.. కష్టాల గరళాన్ని కడుపులోదాచుకునే శివునిలా.. బిడ్డల అభీష్టం మేరకు వారి వారి భవిష్యత్తును రచించే బ్రహ్మలా.. అన్ని కలగలిపి త్రిమూర్తులతత్వాన్ని తనలో ఇముడ్చుకున్న కనిపించే దైవం నాన్న..జీవితాన్నిచ్చిన అమ్మతో పాటు..జీవనాన్ని నేర్పిన నాన్ననూ గౌరవించుకోవాలి.. ప్రపంచాన్ని మనకు పరిచయం చేసిన నాన్నను సదా గుర్తుంచుకోవాలి.. తన సంతానం ఎదుగుదల, అభ్యున్నతి కోసం నిరంతరం పోరాడే నాన్న కష్టాలను చూడాలి..చేయి పట్టుకుని అడుగులు వేయించే సమయమైనా.. బడికి తీసుకెళ్లే వేళయినా.. పక్కనుండే నాన్నే ధైర్యం..అమ్మ ప్రేమను చూస్తాం. నాన్న ప్రేమను మనసు లోతుల్లోంచి చూడాలి.. అమ్మ అభిమానాన్ని చూడగలం.. నాన్న అభిమానాన్ని అంతర్లీనంగా చూడాలి.. కుటుంబం కోసం కష్టాన్ని ఇష్టంగా మార్చుకుని.. పిల్లల సంతోషంలోనే తన సంతోషాన్ని వెతుక్కునే నిస్వార్థపరుడు నాన్న.. మనకు వసతులు, సౌకర్యాలు, విలాసాలు అందించేందుకు పడే తపనను తనలో దాచుకునే వ్యక్తి నాన్న.. తను సాధించలేనిది.. మీరు సాధించేలా ప్రోత్సహించే గొప్ప ధైర్యం నాన్న"..అలాంటి నాన్న సేవలను గుర్తు చేసుకోవడం కోసమే నేడు ప్రపంచ తండ్రుల దినోత్సవం..కుటుంబంలో తల్లిదండ్రుల పాత్ర వేర్వేరుగా ఉండదు.. ఒకప్పుడు అమ్మ అంటే పిల్లల పోషణ, నాన్న అంటే బరువు బాధ్యత పని అనుకునే వారు.. ప్రస్తుతం ఇంటి వంట పనుల నుంచి ఆఫీసు పనుల వరకు ఇరువురుపంచుకోవడం సర్వ సాధారణమైంది. పిల్లల ఎదుగుదల విషయంలో తండ్రులు మాత్రం ఎక్కువ ఆలోచనలో పడుతున్నారు.. తమ బిడ్డలకు కావాల్సిన ప్రతి పనిని చేసి పెడుతూ ఉద్యోగాలు వచ్చే వరకు మార్గదర్శిగా నిలుస్తున్నారు.. ఇంట్లో కాలక్షేపానికి చదివే పుస్తకాల నుంచి పిల్లల వ్యక్తిగత అభివృద్ధి కోసం ఫ్రెండ్‌గా, ఉపాధ్యాయుడిగా, గైడ్‌గా తండ్రి అన్ని పాత్రలు పోషిస్తున్నారు..

**తండ్రి పాత్ర కీలకం:**

గురువుగా తండ్రి స్థానం మొదటిది.. తర్వాత మిగతా చదువు నేర్పిన గురువుతో పాటు ఇతరులది.. పిల్లల పెంపకంలో తల్లి పాత్ర ఎంత ఉంటుందో తండ్రి పాత్ర కూడా అంతకంటే ఎక్కువగా ఉంటుంది.. ఎన్నో కష్టాలు పడి వారి అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తాడు తండ్రి.. పిల్లలు తప్పుదోవ పట్టకుండా ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ మంచి మార్గంలో పయణించేలా దారి చూపుతాడు.. పిల్లల భవిష్యత్తుకు తండ్రి పడే శ్రమ చెప్పలేనిది..రోజు మనకు కావల్సిన సౌకర్యాలు సమకూర్చేందుకు అనునిత్యం పరితపించేది తండ్రి..తన పిల్లల ఎదుగుదలనుతన విజయంగా భావించి గర్వపడే గొప్ప మనసున్న ఫాదర్స్ ఎందరో..అలాంటి తండ్రులు తమ పిల్లల్ని అపురూపంగా పెంచుతూ గొప్పగా భావించే వ్యక్తి నాన్నే...

• వివరాలు 2లో

# ఎన్నికల ముందు ఇచ్చిన హామిని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



**కర్నూలు హాస్పిటల్, జూన్ 15, ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, నవ్యాంధ్రప్రదేశ్ రూపకర్త, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన వాగ్దానం మేరకు బాధ్యతలుచేపట్టిన వెంటనే ఐదు హామిల అమలుకు సంబంధించి సంతకాలుచేసి మాట నిలబెట్టుకున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా పార్లమెంటు అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. శనివారం టిడిపి కార్యాలయంలో పార్టీ నాయకులు బిటి నాయుడు, సోమిశెట్టివెంకటేశ్వర్లు, అకేపోగు ప్రభాకర్, డా.సంజీవ్‌కుమార్, డా.కెవి సుబ్బారెడ్డి, ఎస్ ముంతాజ్, నాగేంద్రలతో కలిసి ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పదవి ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు నాయుడు 13వ తేదిన బాధ్యతలు స్వీకరించి ఐదు ఫైళ్ళపై సంతకాలు చేయడం జరిగిందన్నారు. మొదటి సంతకం మెగా డిఎస్సీపై చేసి 16,347 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసే ఫైల్‌పై సంతకం చేయడం జరిగిందన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, సామాజిక పెన్షన్ల పెంపు, అన్నక్యాంటిన్ల పునరుద్ధరణ, స్కిల్ సెన్సస్‌పై ఐదవ సంతకం చేసి నైపుణ గణన చేపట్టి యువతలోని నైపుణ్యతను బట్టి వారికి అసక్తిగల రంగాలలో వృద్ధిలోకి వచ్చేందుకు స్కిల్ సెన్సస్‌పై సంతకం చేయడం జరిగిందన్నారు. కర్నూలు జిల్లా నుండి ముగ్గురికి రాష్ట్రమంత్రివర్గంలో ఉన్నతమైన శాఖలను కేటాయించి జిల్లాకు ప్రత్యేక గుర్తింపునిచ్చారని ఒక దళిత మహిళ అనితను హోంమంత్రిగా నియమించినందుకు చంద్రబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో వుండే ఎన్డియే కూటమి ప్రజాప్రభుత్వం అనునిత్యం ప్రజల కోసం రాష్ట్ర అభివద్ధి కోసం పనిచేస్తుందని ప్రజలు ఇచ్చిన గౌరవాన్ని వమ్ముచేయకుండా నిలుపుకుంటామని తెలియజేశారు. ఈకార్యక్రమంలో జేమ్స్, సత్రం రామకృష్ణుడు, షేక్షావలి, చిన్నమారెన్న, యల్లప్ప, చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# శాతనకోట వద్ద కూలీన కె.సి.కెనాల్ గోడ



**నందికొట్కూరు, జూన్ 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శాతనకోట గ్రామ సమీపంలోని తూం నెం. 72 ఎల్ వద్ద కె.సి.కెనాల్ గోడ (కట్ట) శనివారం కూలిపోయింది. ఇప్పటికే కె.సి.లో నీరు నిండుగా ఉండడంతో పూర్తిగా తెగిపోతుందోనని రైతులు ఆంధోళన వ్యక్తం చేస్తున్నారు.

# పట్టణ పరిశుభ్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి ఎమ్మెల్యే బివి

**ఎమ్మిగనూరు, జూన్ 15ప్రభాతవార్త:** ఎమ్మిగనూరు పట్టణంలో పరిశుభ్రత, ఆరోగ్య సమస్యలపై రానున్న వర్షకాలాని బట్టి అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని శాసన సభ్యులు డాక్టర్ బివి జయనాగేశ్వర రెడ్డి అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన మొదటి సారిగా మునిసిపల్ కార్యలయనికి వచ్చిన సందర్భంగా మునిసిపల్ కమిషనర్ వారికి సాదర స్వాగతం పలికి మునిసిపల్ అవరణంలో మొక్కలను ఎమ్మెల్యే చేతులమీదుగా నాటించారు. ఈకార్యక్రమంలో డిఎస్‌పి, ఎస్ఐలు మునిసిపల్ అధికారులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గోన్నారు.



# నేను అధికారులను బలి పశువులు చేయను

**- ఎవరైనా రాజకీయం చేసి ఒత్తిళ్ల తెస్తే నాకు చెప్పండి**

**- ఏ ఉద్యోగి కూడా రాజకీయం చేయొద్దు..: ఎమ్మెల్యే పార్థసారథి**



**ఆదోని, జూన్ 15, ప్రభాతవార్త**

గత ప్రభుత్వంలో ఉద్యోగిని సస్పెండ్ చేశారని వారిలాగా నేను ఏ ఉద్యోగిని కూడా సస్పెండ్ చేయనని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయం నందు మున్సిపల్ కమీషనర్ రామచంద్రరెడ్డి, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా పట్టణంలో ప్రజలకు నీటి సమస్యను పరిష్కరించాలని అలాగే రోడ్డు వెడల్పు కూడా చేయాలని అప్పుడైతేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రాంజల చెరువు ప్రజలకు తాగునీరు అందించేందుకు అక్కడున్న నీటిని శాంపుల్స్ టెస్ట్‌కు పంపాలని అధికారులను ఆదేశించారు. ఎవరైనా అధికారుల దగ్గరికి వచ్చి ఎమ్మెల్యే చెప్పాడని పేరు వాడుకుని అధికారులకు ఒత్తిడి తెస్తే అలాంటి వారిని సహించనని అలా ఎవరైన చేస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అధికారులు,ప్రజలకు ఏ సమస్య ఉన్నా నేరుగా నన్ను కలిసి విషయం చెప్పాలన్నారు. అధికారులు కూడా ఎవరైనా రాజకీయం చేసి పనులు చేస్తే అలాంటి వారిని సహించనని అన్నారు. ముందుగా ఆదోని శుభ్రంగా ఉంచుకోవాలని ఆదోని శుభ్రంగా ఉంటేనే నా ఇల్లు శుభ్రంగా ఉన్నట్లు అన్నారు. నేను ఎమ్మెల్యే అంటూ ప్రత్యేకత ఏమీ లేదని నేను ప్రజల్లో ఒకడినని నాకు ఐదేళ్ల పదవికాలం ఇచ్చారని అందుకోసం అభివృద్ధి చేసి చూపిద్దామని అందుకుగాను మున్సిపల్ అధికారులు ప్రతిఒక్కరు సహకరించాలని అందరు సహకరిస్తేనే మార్పు వస్తుందన్నారు. ప్రజలు మార్పు కోసం నన్ను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని అందుకోసం మార్పు చేసి చూపిద్దామన్నారు. అధికారుల దృష్టిలో నేను ఎమ్మెల్యే అని అనుకోకుండ మీలో నేను ఒకడినని అధికారులు అనుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీమఠంలో ఘనంగా.. శ్రీ వాదీంద్రతీర్థుల ఆరాధన వేడుకలు






**మంత్రాలయం, జూన్ 15, ప్రభాతవార్త:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో పూర్వపు పీఠాధిపతి అయిన శ్రీ వాదీంద్రతీర్థుల ఆరాధన వేడుకలు శనివారం ఘనంగా జరాగియి. శ్రీమఠం పీఠాధిపతి శ్రీ సుబుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీ వాదీంద్రతీర్థుల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. మహా పంచామృతాభిషేకం, ఊంజల్‌సేవ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ మూలరాముల పూజలు నిర్వహించి భక్తులను ఆశీర్వదించారు. అనంతరం భక్తులకు పీఠాధిపతి అనుగ్రహ సందేశం ఇచ్చారు. శ్రీమఠంలోని మూలరాముల పూజలకు ఉపయోగించే బంగారు పీఠాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పండితకేసరి రాజా ఎస్ గిరియాచార్. ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్‌లు ఎస్‌కె శ్రీనివాసరావు, వెంకటేష్‌జోషి, జోనల్ మేనేజర్ శ్రీపతి ఆచారి, అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహమూర్తి, పిఆర్ఓ వ్యాసరాజాచారి, ద్వారపాలక అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం

**- టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి**



**మంత్రాలయం, జూన్ 15, ప్రభాతవార్త:** టిడిపి పార్టీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. శనివారం నియోజకవర్గకేంద్రమైన మంత్రాలయంలోని టిడిపి పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం డిఎస్‌సిపై మొదటి సంతకం ముఖ్యమంత్రి చేశారన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో పార్టీకోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగాఉంటామన్నారు. త్వరలోనే కార్యకర్తలకు మంచిరోజులు వస్తాయన్నారు. అనంతరం నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు తిక్కారెడ్డికి పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. స్వీట్లుపంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్, ఆదోని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు, భరద్వాజ్‌శెట్టి, అడివప్పగౌడ్, చెన్నబసప్ప, ఎల్లారెడ్డి, బిసిసెల్ అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, విజయరామిరెడ్డి, వట్టెప్పనరసింహులు, చిన్న భీమన్న తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తుకు నిలువుటద్దం..నాన్న..!

(మొదటి పేజీ తరువాయి ) :
అని చెప్పక తప్పదు.. నేటి తరంలో ప్రధానంగా ఆడపిల్లని తన అమ్మగా భావించి ఎంతో సుకుమారంగా పెంచుతాడు.. పాశ్చాత్య సంస్కృతి నుండి కాపాడుకుంటూభారతీయ సంస్కృతి సాంప్రదాయాలు ఎప్పటికప్పుడు తెలియజేస్తూ వారి అభివృద్ధికి బాటలు వేస్తున్నాడు.. గెలిచినప్పుడు పదిమందికి చెప్పుకునే వ్యక్తి ఓడినప్పుడు భుజాలపై తట్టి గెలుస్తావులే అని దగ్గరకు హత్తుకునేవ్యక్తి నాన్న ఒక్కరే.. లక్ష్యం వైపు దూసుకెళ్లే బాణం మనమైనా నాన్నలాంటి వారేలేకపోతే దాని ఫలితం శూన్యం.నాన్న పెంపకంలో కఠినత్వం ఉన్నా ఆ పెంపకానికి కారణం రేపటి మన భవిష్యత్తుకు ఆయన పడే తపన రేపటిమనకు నిలువుటద్దం నాన్న.. అలాంటి నాన న్న దేవుడి కన్నా మిన్నా..
తన పల్లలను పెంచి పెద్ద చేయడం..కుటుంబానికి ఆర్థిక వనరులు సమకూర్చడం, పిల్లలకు నచ్చిన అభీష్టం మేరకువారిని ఆయూ రంగాల్లో తీర్చిదిద్దడానికి తండ్రి నిరంతరం తపిస్తూనే ఉంటాడు..నిరంతరం పనిచేసే యంత్రంగా, ఆర్థికంగా ఎదగడానికి తన పిల్లలకు తండ్రిగానే కాకుండా మంచి స్నేహితునిగా భరోసానిస్తూ అనారోగ్య సమస్యఎదురైనప్పుడు, పిల్లలకు అన్ని తానై కొండంత ధైర్యాన్ని తండ్రి అందిస్తున్నాడు.. పిల్లలు పుట్టింది మొదలు వారినిపెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు నేర్పించి, ఉపాధి అవకాశాల కోసం ప్రయతా న్లు చేసి వారికి పెళ్లీలు చేయడం, వారిసంతానానికి అండగా ఉండటం, ఇలా ఒక పెద్ద కుటుంబ వ్యవస్థ ఏర్పడటానికి నాన్న కీలక భూమిక వహిస్తున్నాడు..

**ఫాదర్స్ డే ఎలా వచ్చింది:**
ప్రతి సంవత్సరం జూన్ నెల మూడో ఆదివారం ఫాదర్స్ డేగా ప్రపంచం అంతా జరుపుకుంటారు.. అమెరికాలోని పశ్చిమ వర్జీనియా మొనోన్ అనే పట్టణం బొగ్గు గనికి ప్రసిద్ధి.. ఈ గనిలో ఓ రోజు తీవ్రమైన పేలుడు సంభవించింది.ఆ సమయంలో గని కూలిపోయి ఆ ప్రమాదంలో 360మందికి పైగా చనిపోయారు.. వీరిలో అత్యధికంగా ఇటలీకి చెందిన వారే ఉనా న్నరు..దాదాపు వేయి మంది దాకా పిల్లలు తమ తండ్రులను కోల్పోయి అనాథులయ్యారు.. తండ్రులను కోల్పోయిన వారిలో ఒకరైన గ్రేస్ గోల్డెన్ క్లైంటన్ అనే ఆమె చనిపోయిన తండ్రులందరికీ సంతాపంగా 1908లో ప్రార్థనా సమావేశం నిర్వహించారు.. అప్పటి నుంచి ఇది ఫాదర్స్ డేగా గుర్తించడం జరిగినట్లు తెలుస్తోంది.. అయితే ఇది అంతగా ప్రచారం కాలేదు..దీంతో 2010లో సోనారా స్మార్ట్ డోడ్ అనే మహిళ తండ్రి ఓ సైనికుడుగా పనిచేసేవారు.. తన భార్య చనిపోవడంతో తన ఆరుగురు సంతానాన్ని పోషించారు.. దీన్ని గుర్తుగా కూడా ఆమె అప్పటి నుండి ఫాదర్స్ డేను ఘనంగా నిర్వహించారు.. దీంతో అప్పటి నఉండి ప్రతి సంవత్సరం జూన్ నెల మూడో ఆదివారం ఫాదర్స్‌డేగా ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యంలోకి వచ్చింది..

**నేడు తండ్రికి ఇచ్చే స్థానం:**
వృద్ధాప్యంలో జరుగుతున్న అగౌరవం సమాజంలో మాయని మచ్చలా మారింది.. వృద్ధ తండ్రి బాగోగులు చూడకుండవారిని అనాథ, వృద్ధశరణాలయాలకు పంపించే ప్రబుద్ధులు నేటి సమాజంలో ఎందరెందరో ఉన్నారు.. ముఖ్యంగావిదేశాలో ్ల స్థిరపడిన కొడుకులు తమ తండ్రి, తల్లి బాగోగులు చూడకుండా, కనీసం విపరీత అనారోగ్య పరిస్థితుల్లోకూడా వారిని చూడటానికి రాకపోవడం, చనిపోతే దహన సంస్కారాలకు నోచుకోని దుర్మార్గ నైజంతో ఉన్నపరిస్థితులు నేటి సమాజంలో చోటు చేసుకుంటున్నాయి.. తిని, తినక ఎన్నెన్నో కష్టాలు అనుభవించి తమ పిల్లలను సమాజంలో గౌరవంగా బతికేలా, తమ సర్వసాన్ని ధారపోసిన తండ్రికి ఉన్న మహోన న్తత స్థానాన్ని ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలని, వృద్ధాప్యంలో తండ్రిని, తల్లిని తమ కన్న బిడ్డల్లా చూసుకుంటూ వారి గౌరవ స్థానాన్ని పదిలంగా ఉంచాల్సిన బాధ్యత ప్రతి కొడుకు, కూతురుపై ఉందన్నది అక్షర సత్యం..

# విద్యాశాఖలో "ప్రవీణ్ ప్రకాష్" శకం ముగిసింది

**–అధికారులను, ఉపాధ్యాయులను ముప్పుతిప్పలు పెట్టిన వైనం**



**నంద్యాల విద్య, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పరిపాలనలో భాగంగా అధికారుల ప్రక్షాళన ప్రారంభించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విదా ్యశాఖలో రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీగా ఉన్న ప్రవీణ్‌ప్రకాష్ ఉన్న సమయంలో రాష్ట్రంలోని ఉపాధ్యాయులను, ఎంఈఓలను, ప్రధానోపాధ్యాయులను, డిప్యూటి డిఈఓలను, ఆర్జేడిలను, డిఈఓలను ముప్పుతిప్పలు పెట్టిన సంఘటనలు కోకోళ్ళలుగా ఉన్నాయి. ప్రభుత్వం మారడంతో ఐఏఎస్, ఐపిఏస్ అధికారుల బదిలీలపై కసరత్తు ప్రారంభమయింది. వైస్సార్‌సీపీ పార్టీకి అనుకూలంగా వ్యవహారించిన పలు అధికారుల్లో విదా ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్‌ను కూడ జిఏడిలో రిపోర్టు చేయాల్సిందిగా ప్రభుత్వం అదేశించినట్లు సమాచారముంది. రాష్ట్రంలో విద్యాశాఖ ప్రక్షాళనకు ప్రవీణ్ ప్రకాష్ కృషిచేసిన సంఘటనలున్నాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉపాధ్యాయుల పనితీరుపై ఆయన సుమారుగా 10 ఎపిసోడ్‌ల విడియోలను విడుదల చేసి అవి పాటించాలని అధికారులను అదేశించిన సంఘటనలున్నాయి. విద్యార్థుల చదువుపై రాత్రి సమయాల్లో కూడ విద్యార్థుల ఇళ్ళకు వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి విద్యాశాఖ అభివృద్ధికి కృషిచేశారని కొందరు భావిస్తారు. మరి కొందరు తల్లిదండ్రుల, విద్యార్థుల ఎదురుగా ఉపాధ్యాయులను, అధికారులను బాధపెట్టె మాటలు మాట్లాడారని పలువురు విమర్శిస్తుంటారు. ఏ జిల్లాకు, ఏ పాఠశాలకు సందర్శనకు వెళ్లినా అక్కడ ఉపాధ్యాయులను బహిరంగంగా లక్షల రూపాయలు జీతాలు తీసుకుంటున్నారు. చదువులు సరిగా చెప్పరా అంటూ గద్దించారంటూ పలు మీడియాల్లో పలు సంఘటనల్లో వచ్చాయి. కొంతమంది ఉపాధ్యాయులు ఇతనిమీద కోపంతో వైసీపీ పార్టీకి ఓటు వేయకుండా టిడిపి కూటమికి బహిరంగంగా ఓటు వేశామని చెప్పడం విశేషం. ఇతని పనితీరుపై పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసిన సంఘటనలున్నాయి. విద్యాశాఖను ప్రక్షాళనం చేసేందుకు మంత్రిగా నారా చంద్రబాబు నాయుడు కుమారుడు నారా లోకేష్‌కు ఆశాఖను అప్పగించారు. ప్రవీణ్ ప్రకాష్‌ను విద్యాశాఖ నుంచి తప్పించడంతో పలు సంఘాల నాయకులు, పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# నాడు-నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**; ఏఎంఓ లలితకుమారి**



**గడివేముల, జూన్15, ప్రభాతవార్త;** గడివేములలోని స్థానిక ఎంఈఓ కార్యాలయంలో శనివారం నాడు ఏర్పాటు చేసిన సమావేశంలో సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరీ ఆఫీసర్ లలితకుమారి మాట్లాడుతూ జిల్లాలో నాడు-నేడు పనులు చివరిదశలో ఉన్నాయన్నారు. వాటిని వీలైనంత త్వరలో పూర్తి చేయాలని హెచ్ఎంలకు సూచించారు. ఒక్కో పాఠశాల వారీగా పనుల పురోగతిని సంబంధిత సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా హెచ్ఎంల యొక్క పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ సమావేశంలో ఎంఈఓ మేరీ సునీత మాట్లాడుతూ జిల్లా అధికారుల యొక్క సూచనలు పాటించి నాడునేడు పనులను పూర్తి చేయాలన్నారు. అలాగే అసిస్టెంట్ ఏఎంఓ యూనిస్ బాషా మాట్లాడుతూ ఉపాధ్యాయులకు కానీ, ఇంజనీరింగ్ సిబ్బందికి గానీ ఏవైనా సందేహాలు ఉంటే జిల్లా అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించుకోవాల్సిందిగా తెలియజేశారు.

# పలు పథకాల పేర్లు మార్పు

**– విద్యాకానుక పేరును స్టూడెంట్ కిట్‌గా మార్పు**
**– స్పందన పేరును ఫిర్యాదుల పరిష్కారాలుగా మార్పు**

**నంద్యాల విద్య, జూన్ 15, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం వివిధ పథకాలకు పెట్టిన పేర్లను ఇటీవల అధికారం చేపట్టిన టిడిపి ప్రభుత్వం పలు పథకాల పేర్లను మార్పు చేసింది. టిడిపి అధినేత నాల్గవసారి ముఖ ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబు నాయుడు పలు పథకాల పేర్లను మార్పుచేస్తు ఉత్తర్వులు జారీచేశారు. వీటిలో జగనన్న విద్యాకానుక కిట్‌లను స్టూడెంట్ కిట్‌లుగాను వైఎస్సార్ పెన్షన్ పథకానికి ఎన్‌టిఆర్ భరోసా పథకంగా ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం పేరును పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టంగా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. వీటికే కాకుండా పలు సంక్షేమ పథకాలకు పేర్లను మార్చారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి స్వీకరించే ఫిర్యాదులను ప్రజాసమస్యల ఫిర్యాదులు పరిష్కారాలు అనే పేరుతో పిలువనున్నారు. మిగిలిన పథకాల పేర్లు కూడ మారుసు ్తన్నారు. ప్రస్తుతం పెన్షన్ పథకాన్ని ఎన్‌టిఆర్ భరోసా పథకంగా మారుస్తు రూ.4 వేలకు పెంచారు. ఈనెల 18న మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామిల అమలుకు సంబంధించి మంత్రివర్గ సమావేశంలో చర్చించేందుకు కీలకమార్పుల దిశగా ఈప్రభుత్వం అడుగులు వేస్తుందని తెలిపారు.

# ఎంబిఎ, ఎంసిఏ కోర్సులకు ప్రాధాన్యత

**– అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం**




**నంద్యాల విద్య, జూన్ 15, ప్రభాతవార్త:** ప్రస్తుతం పలు కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రమైన నంద్యాల్లోని రామకృష్ణ డిగ్రీ అటానమస్ కళాశాల నందు పోస్టుగ్రాడ్యుయేషన్ కోర్సులు చేయడానికి ఏఐసిటిఈ అప్రోల్‌తో ఎంబిఎ, ఎంసిఏ కోర్సుల్లో చేరడానికి అవకాశం ఉందని డిగ్రీ పీజీ కళాశాల చైర్మన్ డా.జి.రామకృష్ణారెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ విద్యాసంవత ్సరానికి ఎంబిఎ, ఎంసిఏ కోర్సుల్లో ఒక్కొక్క కోర్సుకు 120 సీట్లు, ఎంబిఏ ఫైనాన్స్ కోర్సుకు ఉన్నాయన్నారు. అలాగే బిబిఏ, బిసిఏ కోర్సులకు కూడ బిబిఏ కోర్సులో 180, బిసిఏ కోర్సులో 240 సీట్లు ఉన్నాయన్నారు. నంద్యాల పట్టణ పరిసర ప్రాంత విద్యార్థిని విద్యార్థులు తమకు నచ్చిన కోర్సుల్లో ప్రవేశాలు పొందాలని ఆయన కోరారు.

# వీరాపురం గ్రామ సర్పంచ్ తెదేపాలో చేరిక



**నందికొట్కూరుటౌన్, జూన్ 15, ప్రభాతవార్త :** కొత్తపల్లె మండలం వీరాపురం గ్రామ సర్పంచ్ సరస్వతి శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. మండలంలోని అల్లూరు గ్రామంలో నంద్యాల పార్లమెంట్ తెదేపా ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యల సమక్షంలో సరస్వతితో పాటు గ్రామానికి చెందిన సుమారు నూరు కుటుంబీకుల వారు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ మాండ్ర శివానందరెడ్డి నాయకత్వంలో గ్రామ అభివృద్ధి జరగాలనే ఉద్దేశ్యంతో తాము తెదేపాలో చేరామన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మాజీ ఎంపీపీ వీరం ప్రసాదరెడ్డి, మాండ్ర సురేంద్రనాథరెడ్డి, రామిరెడ్డి, కార్తిక్‌రెడ్డి, చంద్రశేఖర్, రామగిరి, తిరుమల, వెంకటరమణాచారి, రామకృష్ణ, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

**నేడు రాయితీ విత్తనాల పంపిణీ :** మండలంలోని అల్లూరు గ్రామంలో అదివారం నంద్యాల పార్లమెంట్ తెదేపా ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్యలు రైతులకు రాయితీ విత్తనాల పంపిణీని ప్రారంభించనున్నారు. మిడుతూరు మండల కేంద్రంలో కూడా వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతన్నలకు రాయితీపై విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నారు.

# నూతన కమిటీలు ఏర్పాటు



**ఆదోనిలీగల్, జూన్15, ప్రభాతవార్త;** ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ కార్యాలయంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు, రాష్ట్ర అధ్యక్షులు దేవపూజ ధనుంజయ్య ఆచారి ఆధ్వర్యంలో పట్టణ, తాలూకా, గ్రామ నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా దేవపూజ ధనుంజయ్య ఆచారి మాట్లాడుతూ ఆదోని డివిజన్ పరిధిలో ఉన్న బీసీ కులాల హక్కులను సమస్యలను సాధించేందుకు గత 15 సంవత్సరాలుగా ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో ఎన్నో యేళ్లుగా బీసీల హక్కుల కోసం రిజర్వేషన్ల కోసం బీసీ కులాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నామన్నారు. మన రాష్ట్రంలో కులగణన సర్వే నిర్వహించారని, కానీ బీసీ కులాలవారికి ప్రతి కులానికి సంఖ్య ప్రకటించలేదన్నారు. కావునా కులగణన సర్వే ప్రకారం ఏ కులం జనాభా ఎంతో తెలపాల్సిన అవసరం ఉందన్నారు. నూతన ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దస్తగిరినాయుడు, డివిజన్ ఉపాధ్యక్షులు ఫకృద్దీన్, పెద్దహరివాణం దేవేంద్రప్ప, ధణాపురం శేషన్న, దేవిశెట్టిరరకాష , తాలూకా గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వరరావు, వీరభద్ర, అలిగేర రామాంజనేయులు, డాక్టర్ సోమశేఖర్, బి.మల్లేశ్వరప్ప, వడ్డే మహాదేవ, రాజశేఖర్ పాల్గొన్నారు.

# చెట్లను పెంచి .. పర్యావరణాన్ని కాపుడుకుందాం



**కోడుమూరు, జూన్ 15, ప్రభాతవార్త :** చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడుకుందామని స్థానిక గ్రామాభివృద్ధి కమిటి అధ్యక్షులు డాక్టర్ షాకీర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక అయ్యప ్ప స్వామి దేవాలయం ఆవరణంలో చెట్లను నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు మూడు వందల చెట్లను నాటి కార్యక్రమానికి కమిటి సభ్యులు విరివిగా వచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో డాక్టర్ షాకీర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రకృతిలో అనేక మార్పులు జరుగుతున్నాయన్నారు. ఇలా మార్పులు జరగడం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడటంతో ఏటా కరువు కాటకాలు సంబవిస్తున్నాయన్నారు. వీటికి కారణం ప్రధానంగా చెట్లు లేక పోవడమే నన్నారు. అందుకే ఇప్పటి నుంచి అయిన ప్రతి ఒక్కరూ చెట్లను నాటేందుకు ముందుకు రావాలన్నారు. ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే వాటి దగ్గర చెట్లను నాటడం అలవాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు సిఐ మన్సూరుద్దీన్, సర్పంచ్ భాగ్యరత్న, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంధ్రయ్య, అయ్యప్ప స్వామి కమిటి సభ్యులు నల్లబోలు భాస్కరరెడ్డి, జీతూరి రవికుమార్, జీతూరి శ్రీనివాసులు, బి.రాముడు, కందనోలు క్రిష్ణయ్య, జొన్నలగడ్డల కిరణ్, గంగాధర్ స్వామి, బండ నాగరాజు, హనుమంతప్ప, హోటల్ నాగరాజు, గోపి, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

# మలేరియాతో అప్రమ్తతంగా ఉండండి



**చాగలమర్రి ,జూన్ 15, ప్రభాతవార్త:** సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ, మెదడు వాపు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ తెలిపారు. శనివారం చాగలమర్రి పట్టణంలోని నాల్గవ సచివాలయం పరిధిలోని 16వ వార్డులో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించి ఇంటింటికి వెళ్లి మలేరియా నివారణ పై ప్రజలను అప్రమత్తం చేశారు. దోమలు కుట్టకుండా జాగ్రత్తగా ఉండాలని, ఇంటి ముందర పరిసర ప్రాంతాలు మురుగు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ప్రతిఒక్కరు దోమ తెరలను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు మాధవీ, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



**చాగలమర్రి ,జూన్ 15, ప్రభాతవార్త:** మండలంలోని మల్లివేముల, కేపీ తండా గ్రామాల్లో ఐసీడీఎస్ సీడీపీవో తేజశ్వరి ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. శనివారం ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 27 మంది పిల్లలను ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. అనంతరం బడిబాటలో భాగంగా చిన్నారులు, కిశోర్ బాలికలచే ర్యాలీ నిర్వహించి చిన్నారులచే గ్రాడ్యుయేషన్ చేసిన వేషధారణను వేయించి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుశీలమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పండుగలను సామరస్యంతో జరుపుకోవాలి

**వెల్దుర్తి, జూన్15, ప్రభాతవార్త :** పండుగలను భక్తిభావంతో సామరస్యంతో జరుపుకోవాలని ముస్లిమ్ సోదరులకు, హిందువుల కు కర్నూలు డి.టి.సి సి.ఐ రమేశు ఇరువురికి తెలియజేశారు. రాబోవు బక్రీదు పండుగ సం దర్భంగా హిందువులు, ముస్లిమ్‌లు సోదరభావంతో మసలుకోవాలన్నారు. శాంతియుతంగా ఒకరి పండుగలు వెరోకరు గౌరవించేలా ఉండాలన్నారు. కులమతాలు భేదాలు లేకుండా కలిసి మెలిసి పండుగను జరుపుకోవాలన్నారు. ఏమైన సమస్యలుంటే పోలీసు అదికారుల దృష్టికి తీసుకోని వచ్చి పరిష్కరించుకోవాలనిసూచించారు.

# రైలు ఆపాలని పట్టుబడుతున్న తెలుగు తమ్ముళ్లు

**– హామీ ఇచ్చిన ఎంపి**



**మద్దికెర, జూన్ 15, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మద్దికెరలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం కర్నూలు జిల్లా ఎంపి బస్తిపాటి నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపిని రైలు నిలుపుదల చేయాలని కోరినట్లు తెలిపారు. కరోనా సమయం ముందు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు ఆగుతూ ఉండేవని కరోనా తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లను రైల్వే శాఖ నిలుపుదల చేయడం లేదని గత ప్రభుత్వ హయాంలో వైసిపి నాయకులు తూతూమంత్రంగా రైల్వే శాఖ అధికారుల దగ్గరకు, నాయకుల దగ్గరకు వెళ్లారు తప్ప సాధించలేకపోయారన్నారు. ప్రస్తుత మన ప్రభుత్వ హయాంలో రైలు నిలుపుదల చేసి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు రైలు సౌకర్యం కల్పించాలని కోరారు. ఎంపిని కలిసిన వారిలో మండల టిడిపి నాయకులు, తెదేపా పార్లమెంట్ కార్యదర్శి గూడూరు ధనుంజయుడు, తెలుగు యువత అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్, అగ్రహారం శ్రీనివాసులు, మల్లికార్జునతో పాటు వివిధ గ్రామాల తెదేపా నాయకులు, కార్యకర్తలు వున్నారు.

# శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహాస్వామి ఆలయానికి రూ.8.21 లక్షల ఆదాయం



**బేతంచెర్ల, జూన్ 15, ప్రభాతవార్త:** ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహాస్వామి, శ్రీమహాలక్ష్మీ అమ్మవారి క్షేత్రానికి రూ.8,21,047ల ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఉప కమిషనరు, ఆలయ ఈఓ రామాంజనేయులు శనివారం తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ ్చిన భక్తులతో స్వామివారి ఆలయ పరిసరాలన్ని జనసంద్రంగా మారాయి. భక్తులు వివిధ రూపాల్లో స్వామివారికి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. విరాళాలు, వసతిగదుల అద్దెలు, షాపుల బాడిగలు, వివిధ సేవా టిక్కెట్‌లు, లడ్డుప్రసాద విక్రయాల ద్వారా ఈమొత ్తం చేకూరినట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని అంబాపురం గ్రామానికి చెందిన సంజన్న రంగమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు, కోడలు గోవిందు, మహాలక్ష్మీలు ఆలయ అభివృద్ధి కోసం రూ.1,11,116లు, అలాగే అనంతపురం పట్టణం కొవ్వూరు నగర్‌కు చెందిన పసుపులేటి మద్దిలేటి సత ్యనారాయణమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు నాగరాజు రూ.1,00,116లు స్వామివారి ఆలయ అభివృద్ధి కోసం చెక్కు రూపంలో విరాళం అందించినట్లు తెలిపారు. దాతలకు స్వామివారి జ్ఞాపికలను శాస్త్రోక్తంగా అందజేయడం జరిగింది.

# నగరంలో అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



**కర్నూలు హాస్పిటల్, జూన్ 15, ప్రభాతవార్త:** నగరంలో అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కర్నూలు వైద్యకళాశాల విద్యార్థులు పేర్కొన్నారు. ఈనెల 9న నందికోట్కూరు డిపోకు చెందిన ఆర్టీసి బస్సు వెనుక నుంచి కరూ ్నలు వైద్యకళాశాల విద్యార్థిని గుద్దగా ఆ విద్యార్తిని మరణించారు. ఈసంఘటనను నిరసిస్తు వైద్య విద్యార్థులు మానవహారంగా ఏర్పడి ధర్నా నిర్వహించి సంఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని నగరంలో అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని, మెడికల్ కళాశాల యందు ట్రాఫిక్ కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేయాలని, ప్రతిఒక్కరు హెల్మిట్ ధరించి వాహనం నడపాలన్నారు. ఈధర్నా కార్యక్రమంలో ముఖ్యులు డాక్టర్ పవన్, కళ్యాణ్, భరత్, కీర్తి, జాన్ విశాల్, సర్వరాజ్, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యానికి పరీక్షా జవాబు పత్రాలు దగ్ధం

**– బి క్యాంపు బాలుర ఉన్నత పాఠశాల స్టోర్‌రూంలో అగ్నిప్రమాదం**
**– పదవతరగతి పరీక్షా పేపర్లు కాలిబూడిద అయ్యాయి**
**– అనుమానాలు వ్యక్తం చేస్తున్న స్థానికులు**

**కర్నూలు విద్య, జూన్ 15, ప్రభాతవార్త:** కర్నూలు నగరంలో తాజాగా జరిగిన పదవతరగతి పరీక్షా పేపర్లు కాలి బూడిదయ్యాయి. అగ్నిప్రమాదం అని అధికారులు చెబుతున్నారు. కానీ ఉద్దేశపూర్వకంగా చేసిన పని అని స్థానికులు చర్చించుకుంటున్నాయి. వివరాల్లోకి వెళ్లితే కర్నూలు బి క్యాంపు బాలుర ఉన్నత పాఠశాలలో భద్రపరిచిన పదవతరగతి పరీక్షా పేపర్లు మంటలకు దగ్ధం అయ్యాయి. గత విద్యాసంవత ్సరానికి సంబంధించి మార్చి నెలలో జరిగిన పదవతరగతి సంబంధించిన పరీక్షా పేపర్లు కావడం గమనార్హం. ఆ పరీక్షల్లో విద్యార్థుల పరీక్షల పత్రాలను మూల్యాంకనం చేసిన తరువాత ప్రస్తుత పాఠశాలలో భద్రపరిచారు. భవిష్యత్తులో సదరు పరీక్షలకు సంబంధించిన ఏదైనా వివాదాలు వస్తే పరీక్షించేందుకు గాను జవాబు పత్రాలు కొంతకాలం భద్రపరుస్తారు. అలా భద్రపరిచిన జవాబు పత్రాలు కాలిపోయాయి. కాగ పరీక్షల విభాగపు అసిస్టెంటు కమిషనరు పర్యవేక్షణలో ఉండాల్సిన జవాబు పత్రాలు ఎలా దగ్ధం అయ్యాయే ప్రశ్నార్థకంగా మారింది. ప్రమాదం అని విద్యాశాఖాధికారులు చెబుతుండగా సదరు పాఠశాలలో అధ్యాపకులకు ప్రధానోపాధ్యాయులకు మధ్య వున్న వర్గపోరు కారణంగా జరిగిన పని అన్న ఆరోపణలున్నాయి. ఏది ఏమైనా పదవతరగతి పరీక్షల జవాబు పత్రాలు భద్రపరచడంలో అధికారుల నిర్లక్ష్యం కొట్టువచ్చినట్లు కనబడుతుంది. పాఠశాల హెచ్ఎం ద్వారా విషయాన్ని తెలుసుకున్న జిల్లా విద్యాధికారి శ్యాముల్ మరియు ఎడి-1 శ్యాముల్‌పాల్‌లు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అంతకుముందే పాఠశాల హెచ్ఎం ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా ఫైర్ సిబ్బంది వచ్చి మంటలార్పాయి. అయితే నిర్లక్ష్యానికి కారణమైన విధులు సరిగా నిర్వహించని నైట్‌వాచ్‌మెన్ చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేస్తున ్నట్లు డిఈఓ మీడియాకు తెలిపారు.



# న్యాయశాఖ మంత్రిని కలిసేందుకు.. ఇష్టపడని ఆ అధికారి..!

**జిల్లా కేంద్రమైన నంద్యాల్లో ఉన్న పలువురు ఉన్నతాధికారులు శనివారం నంద్యాలకు వచ్చిన న్యాయశాఖ మంత్రిని గౌరవపద్రంగా వచ్చి సాంప్రదాయంగా, అనవాయితీగా వచ్చి కలిశారు. ఈజిల్లాలో డిప్యూటీఓగాను ఉమ్మడి కర్నూలు జిల్లాలో డిఈఓగా పనిచేసి బదిలీపై పోయి ప్రస్తుతం కృష్ణాజిల్లాలో ఉన్నటువంటి మహిళా విద్యాశాఖ ఉన్నతాధికారి సైతం న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను కలుసుకోవడం విశేషం. జిల్లాకేంద్రంలో ఉన్న ఓ ఉన్నతాధికారి మంత్రిని కలిసేందుకు ఇష్టపడడం లేదని వార్త సోషల్ మీడియాలో హాల్‌చల్ చేస్తోంది.**

**నంద్యాల విద్య, జూన్ 15, ప్రభాతవార్త:** నంద్యాల జిల్లాలో మాజీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి మొన్న జరిగిన సార ్వత్రిక ఎన్నికల్లో తిరిగి గెలుస్తారని అత్యంత విశ్వాసంతో పనిచేసిన అధికారులలో ఆ అధికారి ఒకరు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వంలో సెలవుపై వెళ్లాలా లేదా బదిలీచేసుకొని వెళ్లాలని అలోచన ఉన్నట్లు తెలియజేసు ్తందని మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయని 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషిచేస్తుడని ఆ అధికారి సొంత జిల్లా వాసి అని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు తేనే సాయిబాబా ఎన్నికల సంఘానికి ఎన్నికల ముందు ఫిర్యాదు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు ఇవ్వడం కలెక్టరు కార్యాలయంలో విచారణ చేయడం విచారణ నివేధిక తుదిదశలో ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జిల్లాలోని కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ఆ అధికారిపై విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. తన సామాజిక వర్గానికి చెందినటువంటి కొంతమంది కిందిస్థాయి అధికారులను తన గుప్పెట్లో పెట్టుకొని విద్యాశాఖలను తన సైగలతో అటాడిస్తున ్నట్లు కొన్ని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలలు రెన్యూవల్ విషయంలో ప్రాథమిక పాఠశాలలు అయితే ఎంఈఓ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు అయితే డిప్యూటి డిఈఓ అనంతరం డిఈఓ స్థాయి అధికారులు తనిఖీ చేసి ఆ పాఠశాలలకు రెవిన్యూవల్స్ అనుమతి ఇస్తుంటారు. అయితే సదరు విదా ్యశాఖ కీలక అధికారి నిబంధనలు కాదని ఎంఈఓ, డిప్యూటి డిఈఓలను పక్కన పెట్టి నేరుగా తన ద్వారానే అన్ని కార్యక్రమాలు సరిపెట్టాలని అదేశించినట్లు పలువురు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఆరోపిస్తున్నారు. ఈసంవత ్సరంలో శిక్షా అభియాన్ ప్రాజెక్టు కింద వచి ్చన లక్షల రూపాయల నిధులు మార్చి లోపల ఖర్చు చేయాల్సి ఉంది. శిక్షా అభియాన్ నిధులు ఎక్కడ ఖర్చుచేశారో, ఏవరి జేబులోకివెళ్లాయో తూతూమంత్రంగా పనులు ఏవరు చేశారో, చేయించారో ఆ అధికారికే తెలియాలి అని పలువురు గుసగుసలాడు కుంటున్నారు. కీలక అధికారిని కాదని కిందిస్థాయి అధికారులు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను కలిసేందుకు భయపడిపోతున్నారన్న పలువురు ఉద్యోగులు పేర్కొంటున్నారు. నంద్యాలో పనిచేస్తున్న వివిధశాఖల అధికారులు, సాక్షాత్తు కలెక్టరు, ఎస్పీలాంటి అధికారులు న్యాయశాఖ మంత్రిని, ఎంపీని శనివారం గౌరవంగా కలిస్తే సదరు విద్యాశాఖలోని కీలక అధికారి న్యాయశాఖ మంత్రి ఫరూక్‌ను కలిసేందుకు ఇష్టపడడం లేదా అన్న ప్రశ్న ఇక్కడి ప్రజాప్రతినిధుల్లో మొదలవుతుంది. అసలు ఆయన దృష్టిలో ఫరూక్ ఎమ్మెల్యే కాదేమో, మాజీ మంత్రి బుగ్గన అండదండలతో విద్యాశాఖలో చక్రం తిప్పిన ఆ అధికారిపై శాఖపరమైన చర్యలు ఉంటాయో లేదో అనేవిషయం న్యాయశాఖ మంత్రి మరియు విద్యాశాఖ మంత్రికే తెలియాలి. పాఠశాలలు ప్రారంభం జరిగి రెండవరోజు మొదలయింది. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణిచేసే విషయాల గురించి విదా ్యశాఖాది కారులు న్యాయశాఖమంత్రితో మాట్లాడాలన్న అలోచన చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

## హిందువులు పూజించే గోహత్యను చట్ట ప్రకారం అడ్డుకోవాలి



**కర్నూలు విద్య, జూన్ 15, ప్రభాతవార్త:** హిందువులు పూజించే గోహత్యను చట్ట ప్రకారం అడ్డుకోని తీరాల్సిందేనని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ అనా ్నరు. రాబోయే బ క్రీద్ సందర్భంగా గో అక్రమ రవాణా, హత్యల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ వినతిపత్రాలు అందించారు. ఈసందర్భంగా గోరంట్ల రమణ మాట్లాడుతూ భారతదేశంలో మెజార్టీ ప్రజలు సర్వదేవతా నిలయమని, పాలిచ్చి కాపాడే మాత అని, పూజించుకునే గోమాతను తాము భుజించడానికి ఎన్నో జంతువులు ఉన్నా 1977లోనే గో అక్రమ రవాణా/ హత్యలపై నిషేధం ఉన్నా చట్టాన్ని ఉల్లంఘిస్తు పట్టుబట్టి మరి గో మాంసాన్ని భుజిస్తు హిందు ధర్మాని ్న అపహాస్యం చేయడం దారుణమని అటువంటి చర్యలను ఓటు బ్యాంకు రాజకీయాలు చేసే ప్రభుత్వాలు, రాజకీయ నాయకులకు వత్తాసు పలికే అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇప్పటి లక్షలాది గోవులు అధికారికంగా హత్యగావించబడుతుండడం చూసి సిగ్గుపడాల్సిన విషయమని తెలియజేశారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాష్ మాట్లాడుతూ విచ్చలవిడిగా జరుగుతున్న గో హత్యలను ఇక ఏమాత్రం ఉపేక్షించబోమని ఎట్టి పరిస్థితుల్లో గో హత్య నిషేధిత చట్టాన్ని పటిష్టంగా అమలుచేసి తీరాలని లేని యెడల గో హత్యనిషేధిత చట్టం కాగ్నిజబుల్ అయినందున విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ కార్యకర్తలు నేరుగా గో అక్రమ రవాణా మరియు హత్యలను అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం పోలీస్ అధికారికి, మున్సి పల్ కమిషనరుకు, రవాణాశాఖ అధికారులకు గో అక్రమ రవాణాను అడ్డుకోవాలని వినతిపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో బజరంగ్ దళ్ విభాగ్ కన్వీనర్ నీలి నరసింహా, గోవిందరాజులు, ఈపూరి నాగరాజు, తెలుగు భగీరథ, మండ్ల హరికృష్ణ, గుజరాతి సురేష్, శివపురం నాగరాజు, సల్కాపురం బాబురావు, యశ్వంత్, రాంబాబు, చైతన్యకుమార్, లోకేష్, అభిషేక్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ట్యాంకర్లతో నీటి సరఫరా..!



**తుగ్గలి, జూన్ 15, ప్రభాతవార్త**

మండల పరిధిలోని శభాష్‌పురం గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తింది. భూగర్భ జలాల మట్టం అడుగంటిపోవడంతో ప్రజలు తాగునీరు దొరక్క నానా ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను ఆ గ్రామ టిడిపి నాయకులు శ్రీరాములు, తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి మోహన్, ఆదినారాయణలు పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ, ఏఈలతో మాట్లాడి గ్రామ పంచాయతీ ద్వారా శభాష్‌పురం గ్రామానికి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయడం జరిగింది. దీంతో వారు ట్యాంకర్లను ప్రారంభించి నీటిని అందించడంతో గ్రామప్రజలు తరుపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శభాష్‌పురం గ్రామంలో దాదాపు గత కొన్ని నెలలుగా నీటి సమస్య వెంటాడుతోందన్నారు. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోకపోవడంతో తమ గ్రామంలో ప్రజల నీటి కష్టాల గురించి ఎంత చెప్పినా తక్కువేనని అన్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను రాబోయే రోజుల్లో పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. రవి, ఓబులేషుతో పాటు మరింతమంది పాల్గొన్నారు.

## పండ్లతోటలు పెంచుకోవడానికి ఆసక్తి ఉన్న రైతులను గుర్తించాలి



**దేవనకొండ, జూన్ 15, ప్రభాతవార్త :** మండలంలో పండ్లతోటలు పెంచుకోవడానికి ఆసక్తి ఉన్న రైతులను గుర్తించాలని ఏపిడి పక్కీరప్ప ఉపాధి సిబ్బందికి సూచించారు. శనివారం మండల పరిషత్ సమావేశ భవనంలో హార్టికల్చర్ నందు పురోగతి లేని క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారిగా ఇచ్చిన టార్గెట్ ప్రకారం పండ్లతోటలు పెంచుకోవడానికి ఆసక్తి ఉన్న రైతులను గుర్తించడంతో పాటు హార్టికల్చర్ గురించి ప్రతి గ్రామంలో టామ్‌టామ్ వేయించాలన్నారు. హార్టికల్చర్ వల్ల చిన్న, సన్నకారు రైతులు ఆర్థికంగా ఎదుగుటకు అవకాశం ఉందని అలాగే పర్యావరణాన్ని రక్షించిన వారవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపిఓ కృష్ణమూర్తి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## సొసైటీ ఇంచార్జ్ సిఈఓగా బొజ్జ నరసింహులు

**ఆస్పరి, జూన్ 15, ప్రభాతవార్త**



ఆస్పరి సొసైటీ ఇంచార్ ్జ సిఈఓగా బొజ్జ నరసింహులు శనివారం భాద్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెడిసిసి జిల్లా అధికారి ఆదేశాల మేరకు సొసైటీ కార్యాలయంలో పనులు జరుపుటకై ఇంచార్ ్జ సిఈఓగా నియమించారని తెలిపారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవడంతో రైతులకు అందుబాటులో ఉండి సొసైటీ సేవలు అందిస్తామన్నారు. సొసైటీలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు పాల్పడకుండ సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గతంలో పని చేస్తున్న అశోక్ సోమవారం స్వచ్ఛంధంగా రాజీనామా చేయడంతో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తమకు జిల్లా అధికారులు ఇంచార్ ్జ సిఈఓగా భాద్యతలు అప్పగించారు.

## పిఎం కిసాన్ నిధులు ఒకే విడతలో ఇవ్వాలి

**– అఖిల భారత రైతు మహాసభ సంఘం జిల్లా నాయకులు బోయ మునిస్వామి**



**ఆస్పరి, జూన్ 15, ప్రభాతవార్త :** కేంద్రప్రభుత్వం ఇచ్చేటువంటి రైతులకు పెట్టుబడి సహాయం కింద మూడు విడతలుగా విడతకు రూ.2వేలు చొప్పున మూడు విడతలు రూ.6వేలు ఇవ్వడం జరుగుతుందని ఒక్కొక్క విడత డబ్బులు రూ.2వేలు మూడు నెలలకు ఒకసారి ఇవ్వడం జరుగుతుందని అలాకాకుండ కేంద్రప్రభుత్వం ఆలోచించి ఒకే విడతలో రూ.6వేలు రైతులకు ఇవ్వాలని అఖిల భారత రైతు మహాసభ సంఘం జిల్లా నాయకులు బోయ మునిస్వామి అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతులకు పెట్టుబడుల కొరకు ఎరువులు, మందులు, విత్తనాలు కొనుగోలు కొరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చేటువంటి రూ.6వేలు ఇచ్చి రైతులను ఆదుకున్నట్లు గొప్పగా ప్రకటనలు చేసుకోవడం సరైంది కాదన్నారు. మూడు విడతలుగా రూ.2వేలు చొప్పున ఇచ్చి రైతులకు పెద్దపీఠ వేస్తున్నామని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం ప్రతిరైతుకు ఎకరాకు రూ.10వేలు చొప్పున పెట్టుబడి సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కీలకమైన హామీలపై సిఎం చంద్రబాబు సంతకాలు చేయడం హర్షనీయం..!

**– టిడిపి మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు వెంకట్రాముడు చౌదరి**



**తుగ్గలి, జూన్ 15, ప్రభాతవార్త :** ఎన్నికల్లో ఇచ్చిన ఐదు కీలకమైన హామీలపై సిఎం నారా చంద్రబాబునాయుడు సంతకాలు చేయడం హర్షనీయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, ఉపాధ్యక్షుడు వెంక ట్రాముడు చౌదరిలు అన్నారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజారంజక పాలన ప్రారంభమైందని అన్నారు. నిరుదో ్యగ యువతకు ఇచ్చిన మాట ప్రకారం చంద్రబాబు సిఎంగా భాద్యతలు స్వీకరించిన తర్వాత ఓటు బ్యాంకు రాజకీయాలకు స్వస్తి చెప్పి యువత, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఐదేళ్ల పాలన సాగుతుందనడానికి నిదర్శనం సిఎంగా చంద్రబాబు భాద్యతలు చేపట్టిన వెంటనే ప్రజలందరికి మేలు చేకూరే విధంగా నిరుద్యోగ యువతకు మెగా డిఎస్‌సిపై తొలి సంతకం చేశారన్నారు. అలాగే ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపై రెండో సంతకం, పేద జీవితాలను మారుస్తూ సామాజిక పించన్ రూ.4వేలకు పెంచుతూ ఫైలుపై మూడవ సంతకం, అన్నా క్యాంటీన్ల పునరుద్దరణపై నాల్గవ సంతకం, నైపుణ్య గణనపై ఐదవ సంతకం చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. ఇచ్చిన ఐదు హామీలపై సంతకాలు చేసి మాట నిలుపుకున్న చంద్రన్నకు ప్రజలు సంబరాలతో జేజేలు పలుకుతున్నారన్నారు.

## ప్రభుత్వం మారిన.. అధికారులకు ప్రేమ మాత్రం తగ్గలేదు..?

**– ప్రభుత్వం మారి 10రోజులైనా బోర్డు మారదా..?**




**ఆదోని, జూన్ 15, ప్రభాతవార్త :** ప్రజా ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వ హయాంలో ఆదోని నియోజకవర్గ పరిధిలోని నాగలాపురం పంచాయతీలో కేంద్ర ప్రభుత్వం నిధులతో రూ.475కోట్లతో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే అప్పటి ప్రభుత్వం వైసిపి అధికారంలో ఉండడంతో మెడికల్ కాలేజీకి పేరు వైఎస్సార్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ అని బోర్డు పెట్టారు. ప్రభుత్వం మారి పదిరోజులైనా మెడికల్ కాలేజీకి వైసిపి పేరు అలాగే పెట్టడంతో అధికారులకు వైఎస్సార్ ప్రభుత్వంపై ప్రేమ తగ్గలేదా అని ఆదోని ప్రజానీకం చర్చించుకుంటున్నారు.

## పాఠ్యపుస్తకాలు పంపిణీ



**ఆస్పరి, జూన్ 15, ప్రభాతవార్త :**

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ తిరుమలరావు తెలిపారు. శనివారం మండల కేంద్రమైన ఆస్పరిలో ఎమ్మార్సీ భవనంలో ఉన్న పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఆస్పరి మండలానికి 65వేల పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా 56వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. వచ్చిన పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. 10వ తరగతి ఫిజిక్ ్స, 7వ తరగతి పుస్తకాలు ఇంకా రాలేదన్నారు. వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని తెలిపారు.

## ఎంపి బస్తిపాడు నాగరాజును కలిసిన నాయకులు

**దేవనకొండ, జూన్ 15, ప్రభాతవార్త**



కర్నూలు ఎంపి బస్తిపాడు నాగరాజును శనివారం అలారుదిన్నె టిడిపి నాయకులు కురువ మల్లయ్య, కురువ కార్పొరేషన్ స్టేట్ మాజీ డైరెక్టర్, టిడిపి యువ నాయకులు మల్లికార్జున, ఎల్ఐసి నరసింహులు, గోపాల్, ఈడిగ విజయ్‌కుమార్, కొండమీద రాజు, రామచంద్ర, మాల మోహన్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలు పార్లమెంట్ అభివృద్ధి కోసం తమవంతుగా కృషి చేయాలని నాయకులు ఎంపిని కోరారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



**నందికొట్కూరు, జూన్ 15, ప్రభాతవార్త:** మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిభిరానికి విశేష స్పందన వచ్చింది. శనివారం విశ్వభారతి మల్టీ స్పెషల్ హాస్పటల్ వారి డాక్టర్.రాఘవేంద్రారెడ్డి, డాక్టర్.వర్షి బృందం కంటి పరీక్షలు, గర్భిణీలకు పరీక్షలు చేసి వారికి మందులు సలహాలు సూచనలు చేశారు. మద్దూరు హారిసర్వోత్తమరెడ్డి, మాజీ సర్పంచ్ కలీలుల్లాబేగ్, మాజీ ఎం.పి.టి.సి. ఖాజామొద్దీన్, స్తానిక నాయకులు పాల్గొన్నారు.

## మూతబడిన ఎస్‌సి హాస్టల్ తిరిగి ప్రారంభించాలి

**మద్దికెర, జూన్ 15, ప్రభాతవార్త**



మూతబడిన ఎస్‌సి హాస్టల్‌ను తిరిగి ప్రారంభించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న, జిల్లా సహాయ కార్యదర్శి అల్తాఫ్‌లు అన్నారు. శనివారం మండలంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో చివరి మండలం ఏదైనా ఉందంటే అది మద్దికెర అని అన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చి అనేక మంది విద్యార్థులు బిసి హాస్టల్‌లో సీట్లు లేక పేద పిల్లలు చదువుకు దూరం అవ్వాల్సి వస్తుందన్నారు. కావున గతంలో మూతబడిన ఎస్‌సి హాస్టల్‌కు పూర్వవైభవం తీసుకొచ్చి విద్యార్థులకు మంచి భవిష్యత్తు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పి శ్రీకాంత్, మండల కార్యదర్శి అరుణ్, పత్తికొండ మండల కార్యదర్శి శివ, జస్వంత్, రాము తదితరులు పాల్గొన్నారు.

## లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం



**నందికొట్కూరు, జూన్ 15, ప్రభాతవార్త:** పట్టణంలోని కోర్టు ఆవరణంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి ఇందిరా ప్రియదర్శిని, జూనియర్ సివిల్ జడ్జి వి.దివ్య లీగల్ అవేర్‌నెస్ ప్రోగ్రాం శనివారం నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతు ఈ నెల 29వ తేదీన అంతర్జాతీయ లోక్‌అదాలత్‌లో సివిల్ మరియు క్రిమినల్ కేసులను రాజీ మార్గాన పరిష్కారం చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సి.ఐ. జి.ప్రకాష్‌కుమార్, ఎస్సై రమణ, బ్రాహ్మణకొట్కూరు, జూపాడుబంగ్లా, మిడుతూరు, పగిడ్యాల మండలాలు ఎస్సైలు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి బస్తిపాటి నాగరాజును కలిసిన కురువ సంఘం నాయకులు



**పత్తికొండ, జూన్ 15, ప్రభాతవార్త :** రాయలసీమ కురువ సంక్షేమ సంఘం నాయకులు కె శ్రీనివాసులు, పత్తికొండ వెజిటబుల్ ఫార్మర్స్ కంపెనీ లిమిటెడ్ సిఈఓ మునిస్వామిలు శనివారం కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజును ఆయన స్వగృహం పంచలింగాలలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపిగా లక్షపైచిలుకు ఓట్లతో ఘనవిజయం సాధించిన బస్తిపాటి నాగరాజును శాలువా, పూలమాలతో సత్కరించి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపి నాగరాజు మాట్లాడుతూ నా విజయం కోసం ప్రయత్నం చేసి నాకు ఓటు వేసి వేయించి నన్ను గెలిపించిన ప్రతి కులజునికి ప్రతి అక్కకు, చెల్లికి, అన్నదమ్ములకు, జనసేన, టిడిపి, బిజెపి కార్యకర్తలు ప్రతిఒక్కరికి పేరుపేరున ధన్యవాదాలు తెలియజేశారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా నన్ను సంప్రదించండి అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కురువ సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అయోధ్య రాముడిని అందరు చూసేలా ముద్రించడం సంతోషం



**పత్తికొండ, జూన్ 15, ప్రభాతవార్త**

అయోధ్య రామమందిరం ప్రతిమ ఉన్న స్టాంపును అందరు చూసే విధంగా ముద్రించడం చాలా సంతోషంగా ఉందని కిసాన్ మోర్చ అసెంబ్లీ ఇంచార్ ్జ సిసి రంగన్న, కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు గోరంట్లలు అన్నారు. పట్టణంలోని పోస్టాఫీసులో శనివారం ఢిల్లీ నుంచి వచ్చిన అయోధ్య రామమందిరం స్టాంపును సబ్ పోస్ట్ మాస్టర్ కిష్టా నాయక్ చేతుల మీదుగా బిజెపి నాయకులకు అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్య రామమందిరం ప్రతిమ ఉన్నటువంటి స్టాంపును ప్రతి మారుమూలపల్లెలో ప్రతిఒక్కరు చూసేలా ముద్రించడం ఎంతో గర్వించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ దండి మల్లికార్జున, బిజెపి మండల అధ్యక్షులు కొత్తపల్లి శంకరయ్యాచారి, ఓబిసి మండల అధ్యక్షులు కర ్ణం చంద్రన్న, తుగ్గలి మండల అధ్యక్షులు లచ్చుంస్వామినాయుడు, పట్టణ నాయకులు రామ్మోహన్, యువమోర్చ నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి నాయకునిపై దాడి

**తుగ్గలి, జూన్ 15, ప్రభాతవార్త :**



మండల పరిధిలోని దిగువ చింతలకొండ గ్రామంలో టిడిపి నాయకులు వైసిపి పార్టీకి చెందిన నాయకుడు శ్రీనివాసులుపై దాడి చేయడం జరిగింది. దీంతో శ్రీనివాసులు తలకు గాయాలు కావడం జరిగిందని, పొలం పనులు చేసుకుంటున్న వ్యక్తిని అడవిలో కాపుకాసి దాడి చేయడం జరిగిందని దీంతో అతడు అక్కడి నుండి పారిపోయాడని ఆ గ్రామ వైసిపి నాయకులు తెలిపారు. గత కొద్దిరోజుల క్రితం వైసిపి నాయకులు ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకంపై తెదేపా నాయకులు రాళ్లతో కొట్టి జెండా కర్రను తొలగించి వేశారని అన్నారు. దీంతో టిడిపి, వైసిపి వర్గీయుల మధ్య గొడవలు తలెత్తాయి. టిడిపి అధికారంలోకి రాగానే గ్రామాల్లో నాయకుల ఆగడాలు రోజురోజుకు తారాస్థాయికి చేరుతున్నాయని, దీంతో గ్రామాలలో ఎలాంటి గొడవలు జరగకుండ దాడులకు పాల్పడుతున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేయడం జరిగిందన్నారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు.

